క్లుప్తంగా

మద్యం షాపుల మూసివేత

కేటీదొడ్డి: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ పరిధిలో ఉన్న వైన్స్, బార్లు, కల్లు కంపౌండ్‌లను మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మూసి వేశారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులను సాయంత్రం 5 గంటల తర్వాత తెరువనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, మద్యం నిల్వ చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్‌లో.. ప్లాస్టిక్ బియ్యం



మానవపాడు: మండల కేంద్రంలోని చెన్నిపాడులో ఓ ఇంట్లో రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతోంది. రేషన్‌బియ్యంలో నిజంగానే ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయా? లేదా వాటిలో ప్రొటీన్‌తో కూడిన బియ్యం ఉన్నాయా? అని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ వివరణ కోరగా రేషన్‌లో వచ్చే బియ్యం పోర్టిఫైడ్ రైస్ అని, ఇవి ప్రొటీన్‌తో కూడినవని పేర్కొన్నారు. బియ్యం నానబెడితే ఇవి నీటిపై తెలియాడుతూ ఉంటాయన్నారు.

విద్యుత్ వైర్లతో చెలరేగిన మంటలు



మానవపాడు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనపడుతోంది. మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ వైర్లు చెట్లకు తగిలి మంటల చెలరేగాయి. దీంతో చుట్టు పక్కన ఉన్నవాళ్లు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ వైర్లకు తగిలే చెట్లను తొలగించాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు పేర్కొన్నారు. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ప్రమాదాలకు కారమవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసి తనిఖీ చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు మద్య, సారా తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జగదీష్, యోన, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రాజోళి: తెలుగు సినీ నటుడు రాంచరణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మెగా స్టార్ తనయుడి పుట్టిన రోజు వేడుకలు రాజోళిలోని భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తామని, ఈ సందర్భంగా గద్వాల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభిమానులు, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వృథాగా విద్యుత్ పరికరాలు



రాజోళి: విద్యుత్ పరికరాలను ఏళ్ల తరబడి వృథాగా పడేయడంతో ప్రజాధనం నిర్లక్ష్యానికి గురవుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని పచ్చర్లలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ఏళ్లు గడిచినా ముందుకు సాగకపోవడంతో వాటికి ఉపయోగించే విలువైన విద్యుత్ సామాగ్రి, స్తంభాలు, ఇతర పరికరాలు అక్కడే పడేశారు. దీంతో అవి వర్షానికి తడిసి, ఎండకు ఎండిపోయి దెబ్బతింటున్నా పట్టించుకునే వారు లేరు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన సామాగ్రి వృథా అవుతూ, దోపిడీకి గురయ్యే అవకాశముందని గ్రామస్తులు పేర్కొన్నారు.

తాగునీటి గోస తీరేనా?

- భూంపురంలో తాగునీటి సమస్య
- గ్రామానికి చేరుకోని మిషన్ భగీరథ
- తాగునీటి వనరులు 5కి.మీ. దూరంలో
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శిథిలమైన పాత ఓవర్ హెడ్ ట్యాంక్



నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్

అయిజ: వేసవిలో తాగునీటి సమస్య తలెత్త కుండా చూడాలని కలెక్టర్లు ప్రతిరోజు జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు సమీక్షలు నిర్వహిస్తున్నా తాగునీటి సమస్యను పరిష్కరించుకోలేని పరిస్థితి భూంపురం గ్రామంలో నెలకొంది. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహన్ గ్రామాన్ని సందర్శించి తాగునీటి వనరుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఎలాగైనా సరే తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. అయితే సమస్యను పరిష్కరించేందుకు అనేక చిక్కుముడులు ఉన్నాయి.

గ్రామానికి చేరని మిషన్ భగీరథ..

గతంలో అధికారులు చేసిన తప్పుల వల్ల ఈ గ్రామానికి మిషన్ భగీరథ తాగునీరు రాలేదు. మిషన్ భగీరథ పనులు ప్రారంభించేందుకు ముందు సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 3000 జనాభా ఉంటే 1500 జనాభా ఉన్నట్లు నివేదిక పంపారు. దానికి అనుగునంగా పైప్‌లైన్ నిర్మించడంతో గ్రామానికి సరిపడినన్ని మిషన్ భగీరథ నీరు రావడం లేదు.

సుదూరంలో నీటి వనరులు..

గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు కొన్ని సంవత్సరాల క్రితం ఊరికి సుమారు 5 కి.మీ. దూరంలో రెండు బోరుబావులు ఏర్పాటు చేశారు. మెదటి నుంచి అనేక సమస్యలు చుట్టుముట్టడంతో తాగునీటిని నిరంతరం సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. మోటార్లు తరుచూ కాలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం, భూమిలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వారానికి రెండు నుంచి మూడు సార్లు లీకేజీ కావడంతో గతంలో నిర్మించిన పాత ఓవర్ హెడ్‌ట్యాంక్‌లో తాగునీటిని నింపలేని పరిస్థితి ఏర్పడింది.

వ్యవసాయ బావులే దిక్కు..

గ్రామ ప్రజల గొంతులు తడిపేందుకు పంటపొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ బోరు బావులే దిక్కయ్యాయి. ప్రతిరోజు ప్రజలు మోటార్ సైకిళ్లపై బిందెలు పెట్టుకొని పంటపొలాల్లో ఉన్న బోరుబావులకు ఏర్పాటు చేసిన పంప్‌సెట్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. కొన్ని ఇళ్లల్లో వృద్ధులు, చిన్నారులు, మహిళలు మాత్రమే ఉండడంతో వారు మోటార్ సైకిళ్లపై వెళ్లి తాగునీటిని తెచ్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసి ప్రజల నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఇటీవల అదనపు కలెక్టర్ అపూర్వ చౌహన్ స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి వనరులను ఎలాగైనా ఏర్పాటు చేసుకొని తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పంటపొలాల నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పటిష్టంగా నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

– నరసింహారెడ్డి, ఎంపీఓ

మిషన్ భగీరథ నీరు రావడంలేదు



గతంలో కొంతమంది అధికారులు తప్పుడు సర్వే రిపోర్ట్ పంపడంతో చిన్న సైజు పైప్ లైన్ వేశారు. గ్రామానికి సరిపడినంతగా మిషన్ భగీరథ తాగునీరు రావడంలేదు. ఇప్పటి వరకు అడపాదడపా వచ్చినా మూడు నెలల నుంచి భగీరథ నీరు పూర్తిగా నిలిచిపోయింది. దానికోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ఖాళీగా ఉంది. దీంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రమైంది.

– ఉసేని, భూంపురం

పైప్‌లైన్ పగిలి పోతుంది



గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు ఊరికి సు మారు 5కి.మీ. దూరంలో కొ న్ని సంవత్సరాల క్రితం రెండు బోరుబావులు తవ్వారు. వాటికి పవర్ మోటార్‌లను అమర్చారు. దూ రం నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో నీటి ఒత్తిడికి పైప్‌లైన్ తరుచూ పగిలిపోతుంది. గ్రా మంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిండడంలేదు. శిథిలమవ్వడంతో లీకేజీలు ఏ ర్పడి ఉన్న నీరుకూడా కిందికి కారుతోంది.

– ఆంజనేయులు, భూంపురం

ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి



ఇంటింటికి ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి మంచినీరు రావడంలేదు. ఆడవారు, చి న్నపిల్లలు, ముసలివారు పంటపొలాలకు వెళ్లి తాగేందుకు నీరు తెచ్చుకోలేరు. తా గునీరు వచ్చినప్పుడు బిందెల్లో నింపుకొని వాటినే రెండు మూడు రోజుల వరకు సరిచేసుకుంటున్నాం. ప్రభుత్వం వాటర్ ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తే బాగుంటుంది.

– జయమ్మ, భూంపురం

రోగులకు వైద్యసేవలు అందించాలి

మల్దకల్: ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులకు అందజేస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యసిబ్బంది అందజేస్తున్న సేవలు, మందుల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందుతున్న పోషకాహారం గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతకు ముందు మల్దకల్‌లో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిని అరికడుదాం



మేలచెర్వులో టీకాలు వేస్తున్న సిబ్బంది



తిమ్మాజిపల్లిలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గద్వాల వ్యవసాయం: పశువులకు గాలికుంటు వ్యాధి ప్రబలకుండా నివారణ టీకాలు తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య పాడి రైతులకు సూచించారు. సోమవారం గద్వాల పట్టణంలోని గంటవీధి, మండల పరిధిలోని లత్తీపురం, మెలచెర్వు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది 41మంది రైతులకు చెందిన 579 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మాధవీలత, శశికుమార్, కృష్ణయ్య, రాముడు, గోపాలమిత్రలు ప్రభాకర్, నర్సింహ, బుద్దుడు, ఫనీంద్రరాజు పాల్గొన్నారు.

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న టీకాలు వేయించి వ్యాధిని అరికడుదామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. మండలంలోని రాజాపురం, వేణిసోంపురం గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది 313 పశువులకు గాలికుంటు వ్యా ధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల కాళ్ల గిట్టలు, నోటిలో పుండ్లు ఏర్పడుతాయని, పశువులు ఆహారం, నీళ్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, వ్యాధి తీవ్రమైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లి గ్రామంలో పశువులకు శాంతినగర్ పశువైద్యశాల డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని 36మంది రైతులకు సంబంధించి 218 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. పశుసంపదను వృద్ధి చేసుకోవడానికి ముందస్తు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, రవికిరణ్, వెంకటమ్మ, కృష్ణనాయుడు పాల్గొన్నారు.

మూలమలుపులు ప్రమాదాలకు పిలుపులు



అమరవాయి - బిజ్వారం మధ్య ఉన్న మలుపు



కుర్తిరావుల చెర్వు-మల్దకల్ మధ్య ఉన్న మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావుల చెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈవిషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

‘పది’ పరీక్షకు 11 మంది గైర్హాజరు



ఉండవెల్లిలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

అయిజ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం ఫిజికల్ సైన్స్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిపార్ట్ మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఠాగూర్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్, కృష్ణవేణి హైస్కూల్, మండలంలోని ఉత్తనూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 986 మంది విద్యార్థులకు 11 మంది హాజరుకాలేదు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మూడు కేంద్రాలలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది, ప్రైమరీ పాఠశాలలో 132 మందిలో 131 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది హాజరైనట్లు తెలిపారు. అనంతరం పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ రాజు పరిశీలించినట్లు తెలిపారు.

‘ఉపాధి’ నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న రాజు

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తున్నారని, పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తకోట రూరల్: త్వరలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రోజు వాహనాల తనిఖీలు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి దగ్గర రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉండరాదని, వెండి, బంగారం, ఆభరణాలు అ నుమతులు లేకుండా తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దేవాలయాల్లో, మస్జిదుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని, ఏ పార్టీకి చెందిన వారైనా వస్తురూపేనా బహుమతు లు పంచితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామా ల్లో బెల్ట్ షాపులు నడుపుతున్న, గ్రామాలకు మ ద్యం తరలిస్తున్నా ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని వివరించారు.

నందిమళ్లకు బస్సుసర్వీసు పునరుద్ధరణ



ఎమ్మెల్యే శ్రీహరిని సన్మానిస్తున్న విద్యార్థులు

అమరచింత: ఎన్నో ఏళ్లుగా గ్రామానికి ఆర్‌టీసీ బస్ సౌకర్యం లేక నందిమళ్ల గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను గుర్తించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు వచ్చేటట్లు చొరవ తీసుకున్నారు. గద్వాల డిపో చెందిన బస్సు అమరచింత, ఆత్మకూర్ వరకు సేవలు అందించనుంది. కానీ గ్రామానికి రహదారి వ్యవస్థ సరిగా లేదని బస్ సర్వీస్‌లను నిలిపివేశారు. దీంతో గ్రామ ప్రజలతో పాటు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపెరించిందని, తమ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన వాకిటి శ్రీహరి విన్నవించడంతో.. ఎమ్మెల్యే గెలిచిన ఆయన ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నారు. గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి జూరాల డ్యాం మీదుగా నందిమళ్ల, అమరచింత, ఆత్మకూర్ వరకు బస్ సౌకర్యం కల్పించాలని కోరడంతో వెంటనే మేనేజర్ స్పందించి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. దీంతో మంగళవారం గ్రామానికి బస్సులో వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు, ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు మంగళవారం రాత్రి స్థానిక మస్‌జిదే నూర్‌లో స్టార్ గ్లాస్, హార్డ్‌వేర్ వారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్‌అలీంరషాది ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూనూస్, అన్వర్, జహంగీర్, ఇమ్రాన్, ఇస్మాయిల్, వాహేద్, నవీద్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని తయాబ్ మజీద్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ముస్లింలు పెద్ద ఎత్తున ఘ న స్వాగతం పలికారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు.

మండలానికి వరల్డ్ టీబీ డే అవార్డులు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి టీబీ వ్యాధి నియంత్రించడంలో ఉత్తమ సేవలు చేసిన డీఎమ్‌ఎచ్‌ఓ శశికళ చేతుల మీదుగా డాక్టర్ రిజ్వానా తానిఫ్ర్, సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్ఎమ్ మాబమ్మ, ఆశ వర్కరు అని షా బేగంలకు ఉత్తమ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు ఎల్లప్పుడు అందిచడానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని వారు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, రోగులకు సేవలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు



అయిజ: బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు మంగళవారం హైదరాబాద్‌లోని సంపత్ కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మేకల నాగిరెడ్డి, ఆర్. శ్రీధర్, ఉప్పల తిమ్మారెడ్డి, భాస్కర్ గౌడ్, లక్ష్మన్న, ఎక్లాస్‌పురం ఆంజనేయులు, కురవపల్లి భీమన్న ఉన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకర్



మానవపాడు: మండలంలోని అమరవాయిలో వాటర్ ట్యాంక్ వృథాగా దర్శమిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్కలకు నీటి సదుపాయం, గ్రామ పంచాయతీ అవసరాలకు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి ట్యాంక్‌ను వాడుకునేవారు. నీటి ట్యాంక్ నిరుపయోగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో పెడుతున్నారు. చెట్లకు, మొక్కలకు నీటిని పెట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటకైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ నోడల్ పర్సన్‌కు ప్రశంసలు



జిల్లా అధికారులతో ప్రశంసాపత్రం అందుకుంటున్న జయప్రకాష్

రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ నోడల్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ జయప్రకాష్ ఉత్తమ నోడల్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శశికళ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిద్ధప్ప మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రశంసాపత్రం అందజేశారు. టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారిని అప్రమత్తం చేస్తూ, మండలంలోని గ్రామాల్లో తనదైన సేవలు అందిస్తున్న ఆయనకు ఈ గౌరవం దక్కడంతో రాజోళి పీహెచ్‌సీ సిబ్బంది డాక్టర్ మదుబాబు, రంజిత్, హెలెన్, రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

మురుగు నీరే శరణ్యం



తూర్పుగార్లపాడు శివారులో మురుగు నీరు తాగుతున్న ఆవులు

రాజోళి: వేసవి ముదురుతున్న కొద్ది మండలంలో తాగునీటి కటకట తీవ్రమవుతోంది. నిన్న మొన్నటి దాకా గ్రామాల్లో కాకపోయినా పొలా ల దగ్గర ఉన్న బోర్ల ద్వారా లభించే నీరు పశువులకు తాగడానికి ఉపయోగపడేది. ప్రస్తుతం పొలాల్లో కోతలు ముగియడం, బోర్లు ఇంకుతుండటంతో మేతకు వెళ్తున్న పశువులకు నీటికి ఇక్కట్లు తప్పడం లేదు. రోజూ వేలాది ఆవులు, ఎద్దులు, గేదెలు మేతకు బయటకు వెళ్తుంటాయి. ఈ క్రమంలో అవి దాహార్తిని తీర్చుకునేందుకు ఎక్కడా నీరు లేకపోవడంతో అక్కడక్కడా నిలిచిన మురుగు నీటితోనే దాహం తీర్చుకుంటున్నాయి. నీరు ఉన్న సమయంలో పొలాల దగ్గర ఉన్న గుంతల్లో నిలిచిన నీరు. చాలా రోజులుగా కొన్ని గుంతల్లో ఉండిపోయి మురుగుగా ఏర్పడిన నీటినే తాగుతూ గొంతు తడుపుకుంటున్నాయి. వాటి దాహార్తిని తీర్చేందుకు పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మేతకు వెళ్లే ప్రదేశాల్లో తాగునీటికి చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

మసీదు పక్కనే మురుగు

మానవపాడు: పవిత్ర రంజాన్‌మాసం ఉపవాస దీక్షలతో ముస్లింలు నిత్య ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం నమాజ్ చేసుకుంటున్నారు. మండలంలోని చెన్నిపాడు లో మసీదు పక్కన మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు నిల్వ లేకుండా, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ వేయాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ముస్లింలు కోరుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

వీపనగండ్ల: అర్ధాంతరంగా విద్యను మానేసి నిరుద్యోగులుగా ఉన్నా యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి ఉన్నవారికి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకంపై శిక్షణ ఇస్తారని తెలిపారు.